



నేడు ట్రిపుల్‌ఐటిల్లో ప్రవేశాలకు
నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - వేంపల్లె

ఆంధ్రప్రదేశ్ రాజీవ్‌గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జెయుకెటి) ఆధ్వర్యంలో 2023-24 విద్యాసంవత్సరానికి ట్రిపుల్ ఐటిలలో ప్రవేశాలకు ఈనెల 3న విడుదల చేయనున్నట్లు ఆర్‌జెయుకెటి అధికారులు తెలిపారు. ఈనెల 4 నుంచి 26న 5గంటల వరకు ఏదైనా ఎపి ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. ప్రత్యేక కేటగిరీ వికలాంగ, ఎన్‌సిసి, స్పోర్ట్స్‌కు చెందిన విద్యార్థులకు జులై 5 నుంచి 9 వరకు నూజివీడు క్యాంపస్‌లో సర్టిఫికెట్లు పరిశీలన ఉంటుందన్నారు. విద్యార్థులకు సీటు కేటాయించే ఫలితాలు జులై13 ప్రకటిస్తారని తెలిపారు. ట్రిపుల్ ఐటీల్లో సీట్లు పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను జులై 3వ వారంలో అయా క్యాంపస్‌ల్లో ఉంటాయని పేర్కొన్నారు. తరగతులు ఆగస్టు 1వ వారంలో ప్రారంభమవుతున్నట్లు అధికారులు తెలిపారు. ఆన్‌లైన్‌లో పదోతరగతి పాస్ అయిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. 2022-23 విద్యాసంవత్సరానికి, గవర్నింగ్ కౌన్సిల్ సిఫారసు మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 4 శాతం డిప్రివేషన్ జోడించి 10వ తరగతి మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు నిర్వహిస్తారని తెలిపారు. ఎపిఆర్‌జెయుకెటి పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీలో క్యాంపస్‌లలో ప్రవేశాలకు ప్రతి ఏడాదీ మూడు సార్లు విద్యార్థులకు కౌన్సెలింగ్‌కు పిలుస్తారని, అధికారిక వెబ్‌సైట్ నుంచి కాల్ లెటర్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆయా తేదీల్లో కౌన్సెలింగ్‌కు హాజరుకావల్సి ఉంటుందని తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులకు రెండేళ్ల పియుసి, నాలుగేళ్ల బిటెక్ కోర్సుతో కలిపి మొత్తం ఆరేళ్ల కోర్సుల్లో ప్రవేశాలు పొందుతారన్నారు. ఎపిలో ఉన్న ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం, నూజివీడు ట్రిపుల్ ఐటి క్యాంపస్ ల్లో 4000 వేల సీట్లు ఉన్నాయని తెలిపారు. ప్రతి క్యాంపస్‌కు 1000 సీట్లు కేటాయించారని, అలాగే ఈడబ్ల్యుఎస్ అభ్యర్థులకు 10 శాతం, అలాగే ప్రతి క్యాంపస్‌కు అదనంగా 100 సూపర్ న్యూమరీ సీట్లు ఉన్నాయన్నారు. ఇందులో 85 శాతం సీట్లు ఆంధ్రప్రదేశ్ అభ్యర్థులకు, 15శాతం ఓపెన్ మెరిట్ (ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రెండింటికీ) రిజర్వ్ చేయబడ్డాయని తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్ నియమావళిని అనుసరించి 10వ తరగతి మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారన్నారు. జనరల్ సైన్స్, ఇంగ్లీషు, సోషల్ స్టడీస్‌లో ఎక్కువ మార్కులను చూస్తారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కాకుండా ఇతర రాష్ట్రాల అభ్యర్థులకు 5 శాతం సూపర్ న్యూమరి సీట్లు అందుబాటులో ఉన్నాయని, అటువంటి అభ్యర్థులకు ట్యూషన్ ఫీజు కింద ఏడాదికి రూ1,50,000 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

ఏడుగురు గంజాయి స్మగ్లర్లు అరెస్టు

ప్రజాశక్తి- కడప అర్బన్

జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలకు పాల్పడుతున్న స్మగ్లర్లపై సికెదిన్నె పోలీసులు దాడి చేసి ఏడుగురు నిందితులను అరెస్టు చేశారని ఎస్‌పి అన్బురాజన్ తెలిపారు. శుక్రవారం పోలీస్ జిల్లా కాన్ఫరెన్స్ హాల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మగ్లర్ల నుంచి 21.600 కిలోల గంజాయి, రెండు మోటార్ సైకిల్, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అరెస్టు అయిన నిందితుల్లో వెంకట శివారెడ్డి, రాహుల్, హరి ప్రసాద్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, పవన్ కుమార్, ప్రతాప్, నరసింహులు ఉన్నారని పేర్కొన్నారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిందితుల అరెస్టుకు కృషిచేసిన అదనపు ఎస్పీ తుషార డూడి, డీఎస్పీ షరీఫ్, సీఐ, ఎస్ఐ, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. **నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లూ..** జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణా పాల్పడుతున్న స్మగ్లర్లపై పోలీసులు దాడులు నిర్వహించి నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారని ఎస్‌పి అన్బురాజన్ తెలిపారు. శుక్రవారం పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మగ్లర్లు వాహనాల్లో దుంగలను ఎక్కిస్తుండగా మైదుకూరు పోలీసులు టాస్క్ ఫోర్స్ అధికారులతో కలిసి పట్టుకున్నారని పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి 300 కిలోల బరువు ఉన్న ఏడు ఎర్రచందనం దుంగలు, కారు, మోటార్ సైకిల్, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో తమిళనాడుకు చెందిన తంగరాజు, శంకర్, జిల్లాకు చెందిన రాజశేఖర్ రామ సుబ్బారెడ్డి ఉన్నారని చెప్పారు. **పోరుమామిళ్లలో 30 దుంగలు స్వాధీనం**

పోరుమామిళ్ల : మండలంలోని రామేశ్వరంలో 30 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని కడప టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు. శుక్రవారం రామేశ్వరంలో రాచకొండ రామయ్య అనే వ్యక్తి ఇంటిలో 30 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కాగా నిందితుడు పరారీలో ఉన్నారు. గ్రామంలో ఫారెస్టు చెక్‌పోస్టు అధికారులు పగలు, రాత్రి విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఎర్రచందనం దుంగలు దొరడకంపై పలువురు విమర్శిస్తున్నారు. నిందితుడు కోసం టాస్క్ ఫోర్స్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు.

పర్యావరణ పోస్టర్లు ఆవిష్కరణ

కడప : పర్యావరణ దినోత్సవం- 2023 పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రచురించిన పోస్టర్లను శుక్రవారం కలెక్టర్ విజయ్ రామరాజు ఆవిష్కరించారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 5న ఉదయం 8 గంటలకు కోటిరెడ్డి సర్కిల్ నుంచి గ్రీన్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి జిల్లా పర్యావరణ ఇంజినీర్ కె. జావిద్ భాషా తెలిపారు. ప్రజలు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జిఎం జయలక్ష్మి, ఎపిఐఐసి జెడ్ ఎం శ్రీనివాసమూర్తి, కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది అనిల్ కుమార్ రెడ్డి, నవీద్ అహమ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఒంటిమిట్ట తహశీల్దార్‌గా మాధవీలత

ప్రజాశక్తి-ఒంటిమిట్ట



కలెక్టర్ విజయరామరాజు ఉత్తర్వుల మేరకు ఒంటిమిట్ట తహశీల్దార్‌గా వై.మాధవీలత శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాసులరెడ్డిని కడప కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన మాధవీలత మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలియజేశారు. మండలంలోని ప్రజా సమస్యలు అర్జీల రూపంలో వచ్చిన వెంటనే పరిష్కారం చూపిస్తానన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా అసాంఘిక శక్తులు ఎలాంటి అసాంఘిక చర్యలు చేసినా వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తర్వాత రెవెన్యూ సిబ్బందితో కలిసి సమావేశం ఏర్పాటు చేసుకుని మండల సమస్యలు గురించి సమీక్షిస్తామని తెలిపారు.

చింతకొమ్మదిన్నె తహశీల్దార్‌గా నారాయణరెడ్డి



చింతకొమ్మదిన్నె : మండల తహశీల్దార్‌గా శుక్రవారం ఎం.వి.ఎస్ నారాయణరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ఖాజీపేట, వల్లూరు తదితర మండలాల్లో పనిచేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా చింతకొమ్మదిన్నెకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు

జిల్లా ఉపాధి కల్పనాధికారిగా అందెల సురేష్‌కుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్



జిల్లా ఉపాధి కల్పనాధికారిగా అందెల సురేష్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన 2007లో కార్మికశాఖ అధికారిగా బద్వేలు, తదితర ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు. గ్రూప్-1 పాసైన తర్వాత 2018లో నెల్లూరు జిల్లా ఉపాధి కల్పనాధికారిగా విధుల్లో చేరారు. సాధారణ బదిలీల్లో భాగంగా అక్కడి నుంచి కడపకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న దీప్తిని కర్నూలు జిల్లా ఉపాధి కల్పనాధికారిగా బదిలీ చేశారు. జూనియర్ ఎంప్లాయ్‌మెంట్ అధికారిగా పనిచేస్తున్న వెంకటరమణను తిరుపతి ఉపాధి కల్పనాధికారిగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన సురేష్‌కుమార్‌ను పలువురు అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెఇఒ డోనప్ప, సూపరింటెండెంట్ రమణ పాల్గొన్నారు.

ప్రయివేట్ పాఠశాలలను తనిఖీ చేయాలి

కడప అర్బన్ : జిల్లాలో కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలు ముందస్తు అడ్మిషన్లు, తరగతులు నిర్వహిస్తున్నాయని, జిల్లా అధికారులు ఆకస్మిక తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని పిడియస్ యు నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం డిఇఒ రాఘవరెడ్డిని ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా పెద్ద, పెద్ద హోర్డింగులు ప్రచారాలతో హోరెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే కార్పొరేట్ పాఠశాలలు సగం అడ్మిషన్లు పూర్తి చేశాయని చెప్పారు. స్పందించి డిఇఒ తనిఖీలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు అన్నమయ్య జిల్లా నాయకులు స్వరూప్ తేజ, నగర నాయకులు శ్రీహరి, రామ్‌మోహన్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పోరుమామిళ్ల టౌన్ : ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందరికీ అందేలా కృషి చేస్తామని ఎంపిపి సి.బాష అన్నారు. శుక్రవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఎంవి డిఒ నూర్జహాన్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజా ప్రతి నిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ పెండింగ్‌లో ఉన్న అన్ని పనులు సత్వ రమే పూర్తి చేస్తామని అన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరూ సహకరించి మండల అభివృద్ధి కృషి చేయాలని అన్నారు. అనంతరం పంచాయతీ విస్తరణ అధికారి భాస్కర్ బాబును శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, జడ్‌పిటిసి ముత్యాల ప్రసాద్, రంగసముద్రం గ్రామపంచాయతీ సర్పంచ్ చిత్త రవి ప్రకాశ్ రెడ్డి, టేకురుపేట సర్పంచ్ రమణారెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ అల్లా, ఎంపి టిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. **విద్యుత్ స్తంభాలను మార్చండి..** స్థానిక పంచాయతీలో విద్యుత్ స్తంభాలు తుప్పుపట్టి ఉన్నాయని, విద్యుత్ సరఫరా సమయంలో ప్రజలు భయాందోళన చెందుతున్నారని, వెంటనే మార్చాలని సర్పంచ్ ఎనమల సుధాకర్ మండల సర్వసభ్య సమావేశంలో సంబంధితాధికారులకు సూచించారు. పంచాయతీ అనుమతులు లేకుండా విద్యుత్ మీటర్లను మంజూరు చేయరాదని తెలిపారు. దీనివల్ల పంచాయతీకి రెవెన్యూ రాకపోవడంతో అభివృద్ధి కుంటు పడుతుందని ఆరోపించారు.



మాట్లాడుతున్న ఎంపిపి బాష

రైతు సంక్షేమానికి పెద్దపీట

వైఎస్ఆర్ యంత్రసేవ పథకం ప్రారంభంలో కలెక్టర్ విజయ్‌రామరాజు



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

దేశానికి వెన్నెముకైన రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని, రాష్ట్రంలో సాగు విస్తీర్ణాన్ని పెంచే దిశగా 'వైఎస్ఆర్ యంత్ర సేవా' పథకాన్ని ప్రారంభించిందని కలెక్టర్ వి.విజయ్ రామ రాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరే ట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతు సంఘాలకు ట్రాక్టర్లు, కంబైన్ హార్వెస్టర్ల మెగా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గుంటూరులో ముఖ్యమంత్రి ప్రత్యక్ష ప్రసారం ముగిసిన అనంతరం కలెక్టర్, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డితో కలిసి జిల్లాలో ఆర్‌బికెల పరిధిలో మంజూరైన యంత్ర సేవా కేంద్రాలకు ఒక్కొక్కటి రూ.15 లక్షల విలువైన 47 ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు, 4 వరికోత మిషన్లకు సంబంధించి రూ. 2.26 కోట్ల సబ్సిడీ మొత్తాన్ని మెగా చెక్కు రూపంలో రైతులకు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 'వైఎస్ఆర్ యంత్ర సేవా' పథకాన్ని అందించి వ్యవసాయ సాగు పనులను మరింత సులభతరం చేశారన్నారు. వ్యవసాయంపై రైతుల్లో మరింత మక్కువ పెరిగేందుకు పాటు గ్రామ సీమలో సాగుబడిని రైతులు పండుగ వాతావరణంలో చేపడు తున్నారని చెప్పారు. రైతు సంక్షేమంలో ముఖ్యమంత్రి ఒక అడుగు ముందుకేసి వ్యవసాయంలో యాంత్రీకరణ వ్యవస్థను సమ్మిళితం చేస్తూ కోట్లాది రూపాయలను వెచ్చించి కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ల ద్వారా అవసరమైన ఆధునిక పరికరాలను సరసమైన అద్దెకు రైతు సహకార సంఘాలకు సబ్సిడీతో ట్రాక్టర్లు, హార్వెస్టర్లను అందిస్తున్నారని తెలిపారు. వ్యవసాయ సీజన్ ప్రారంభంలో రైతులందరూ ఒకేసారి వ్యవసాయ పనులను ప్రారంభించడం కారణంగా కూలీల కొరతతో సాగు ఆలస్యమవుతుండడాన్ని గమనించిన ప్రభుత్వం 'వైఎస్ ఆర్ యంత్రసేవా' పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. దేశానికి అన్నం పెట్టే అన్నదాత రైతన్న సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసి అపారమైన నిధులను విడుదల చేస్తోందన్నారు. అవసరాలకు మించి రైతులను, ప్రజలను సంతృప్త పరుస్తున్న ముఖ్యమంత్రి మన రాష్ట్రాన్ని పాలిస్తుండడం నిజంగా ప్రజల అదృష్టం అన్నారు. అనంతరం కలెక్టర్ ట్రాక్టర్ల స్టార్ట్ చేసి ప్రారంభించి లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నాగేశ్వర రావు, ఉద్యానశాఖ డిడి రాజీవ్ మైఖేల్, డీసీసీ అధికారి సుభాషిణి, వ్యవసాయశాఖ ఎడిలు, సహకార సంఘాల రైతులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో దళితులకు రక్షణ కరువు

- పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు పుట్టపర్తిసర్కిల్/చాపాడు

వైసిపి పాలనలో దళితుల ప్రాణాలకు, ఆస్తులకు, భూములకు రక్షణ కరువైందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 114వ రోజుకు చేరుకుంది. శుక్రవారం ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని కొత్తపల్లి విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమై మైదుకూరు నియోజకవర్గంలోకి ప్రవేశించింది. నాగులాపల్లి క్రాస్, ఖాదర్‌పల్లి, చాపాడు, సీతారాంపురం క్రాస్, చియ్యపాడు క్రాస్, అల్లాడుపల్లె దేవలాలు, కేతవరం, పుల్లయ్య సత్రం, విశ్వనాథపురం విడిది కేంద్రం వరకూ పాదయాత్ర సాగింది. ఆయా ప్రాంతాల్లో స్థానికులు, దళితులు, రైతులతో ముఖాముఖి, మాటామంతి, సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా పలుచోట్ల లోకేష్ మాట్లాడుతూ దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి వారిపైనే ఉక్కుపాదం మోపుతూ తీవ్ర అణిచివేత చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. దళితులకు చెందిన 12 వేల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కున్నారన్నారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా గత నాలుగేళ్లలో దళితుల వద్ద ఉన్న భూమి విస్తీర్ణం తగ్గిపోయిందని తెలిపారు. ఎస్సీలకు చెందాల్సిన సబ్ ప్లాన్ నిధులు రూ.28,147 కోట్లు దారిమళ్లించారని తెలిపారు. 27 సంక్షేమ పథకాలు రద్దు చేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్ అండ్‌కోకు ఇసుక, మట్టి అమ్మకాలపై ఉన్న శ్రద్ధ ప్రాజెక్టులపై లేదన్నారు. నాలుగేళ్లలో బినామీ సంస్థను అడ్డంపెట్టుకొని ఇసుక ద్వారా జగన్ రూ.10 వేల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. జగన్ ధనదాహం కారణంగా అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి 61 మంది అమాయకులు బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పక్షాన నిలవాల్సిన అధికారులు వైసిపి తొత్తులుగా మారడం దురదష్టకరమని తెలిపారు. జగన్ పాలనలో అన్ని రంగాల వారు బాధితులేనన్నారు. సొంత జిల్లా కడప, సొంత నియోజకవర్గం పులివెందులకి ఏం చేశాడో జగన్ చెప్పగలడా? అని ప్రశ్నించారు. ఉమ్మడి కడప జిల్లాలో 10 కి 10 సీట్లు ఇస్తే జగన్ చేసింది ఎంటన్నారు. దొంగ చేతికి తాళం ఇస్తే ఎం జరిగింది? అందరూ దోపిడీకి గురయ్యారని విమర్శించారు.



యువగళం పాదయాత్రలో లోకేష్‌కు హారతులు పడుతున్న మహిళలు

లాయర్లు, డాక్టర్లు, వ్యాపారస్తులు, టీచర్లు, ఐటి నిపుణులు అందరూ జగన్ చేతిలో బాధితులేనని, వీరి విపరీతంగా జగన్ వేధిస్తున్నారని తెలిపారు. జగన్ పాలనలో ఎపి బీహార్‌తో పోటీ పడుతోందన్నారు. ప్రస్తుతానికి షాపులు, వ్యాపారాల మీద దాడి చేస్తున్నారనీ, మరో సారి ఓటేస్తే జగన్ అండ్ కో ఇంటికొచ్చి దోచుకుంటారని తెలిపారు. టిడిపి హయాంలో న్యాయ విభాగానికి నిధులు కేటాయించి కొత్త భవనాలు, లైబ్రరీలు కట్టించడానికి పనులు ప్రారంభించామని, ఈ ప్రభుత్వం ఆ పనులు నిలిపివేసిందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అడ్వకేట్ల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తెస్తామన్నారు. మౌలిక వసతుల కల్పన కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని తెలిపారు. జగన్ వేధింపుల వలన అన్ని కంపెనీలు ఇతర రాష్ట్రాలకు పారిపోతున్నాయన్నారు. జగన్ వేదింపులు, జే ట్యాక్స్ కట్టలేక కంపెనీలు అన్ని ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతున్నాయని తెలిపారు. అమర్‌రాజా, ఫాక్స్ కాన్, రిలయన్స్ లాంటి సంస్థలు వేరే రాష్ట్రాలకు వెళ్లి పోయాయని తెలిపారు. టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే మ్యానిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చి ఆ వ్యత్యాసాన్ని తగ్గిస్తామని పేర్కొన్నారు. పాదయాత్రలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, టిడిపి కడప జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి, ప్రొద్దుటూరు, మైదుకూరు నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్ పాల్గొన్నారు.

పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేయాలి

ప్రజాశక్తి - కడప

జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్టం చేస జిల్లా ఆర్థిక పురోభివృద్ధికి దోహద పడాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు డిఐఇపిసి సభ్యులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా పరిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డిఐఇపిసి) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలే జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయువు పట్టు అని, ఆ దిశగా జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్టం చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వాలని తెలిపారు. ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టి, ఔత్సాహిక నూతన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా పరిశ్రమల శాఖ అధికారులు, బ్యాంకు అధికారులు దృష్టి సారించాలన్నారు. పరిశ్రమల స్థాపన వల్ల వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి లభించడంతో పాటు జిల్లా ఆర్థిక ప్రగతి కూడా మెరుగుపడుతుందని చెప్పారు. పారిశ్రామిక అభివృద్ధి పాలసీ (ఐడిపి) 2015-20, 2020-23లను అనుసరించి జిల్లాలో అన్ని సెక్టార్లలోని మొత్తం 51 యూనిట్లకు గాను. రూ.7.62 కోట్ల రాయితీ మొత్తం విడుదలకు కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. మేరకు పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మి సంబందిత వివరాలను సమావేశంలో కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో ఎపిఐఐసి జోనల్ మేనేజర్ శ్రీనివాస మూర్తి, డిప్యూటీ చీఫ్/ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫాక్టరీస్ డిపార్ట్‌మెంట్ కృష్ణ మూర్తి, లీడ్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ దుర్గాప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ జావిద్ భాష, వాణిజ్య పన్నుల శాఖ, ఎస్‌పిఎస్‌డిసిఎల్, లేబర్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎంపిపి

ప్రజశక్తి-కలసపాడు

మండలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపిపి బోధన బోయిన నిర్మల నారాయణ తెలిపారు. శుక్రవారం ఎంపిడిఒ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో మౌలిక సదుపాయాలలో భాగంగా తాగునీరు, విద్యుత్తు, ఉపాధి, సిసి రోడ్లు, పచ్చదనం, పరిశుభ్రత పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. మండలంలో ప్రతి ఒక్క సచివాలయ పరిధిలో 20 లక్షల రూపాయలు అనేక మౌలిక సదుపాయ పనులకు ప్రభుత్వం కేటాయించిందని సత్వరమే పనులు ప్రారంభించి అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మహబూబ్‌బీ, తహశీల్దార్ రవీంద్రారెడ్డి, వివిధ శాఖల ఇంజినీర్లు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి నిర్మల నారాయణ

విద్యా కానుక కిట్లు పాఠశాలలకు తరలింపు

కడప అర్బన్: జగనన్న విద్యా కానుక కిట్లు అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా జిల్లాలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. శుక్రవారం కడప నగరంలోని సిఎస్‌ఐ పాఠశాలలోని స్టాక్ పాయింట్‌లో పాఠశాలలకు తరలిస్తున్న విద్య కానుక ఏర్పాట్లను సమగ్ర శిక్ష జిల్లా పథక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల తెరిచే మొదటి రోజుకే ప్రతి విద్యార్థికీ జగనన్న విద్యా కానుక అందిస్తామని చెప్పారు. అందుకు అనుగుణంగా జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో జగనన్న విద్యా కానుక వస్తువులను భద్రపరచుకొని ఆయా పాఠశాలలకు పంపించే ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని చెప్పారు. కడప మండల విద్యాశాఖ అధికారి పాలెం నారాయణ మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నందున వల్ల వారికి విద్యా కానుక సకాలంలో అందించాలనే సంకల్పంతో తమ కమిటీని అప్రమత్తం చేశామన్నారు.

వైవీయూ అభివృద్ధికి ప్రభుత్వ చర్యలు

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం సర్వతో ముఖాభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ అడ్వైజర్ అజయ్ కల్లం, ముఖ్యమంత్రి కార్యదర్శి ధనుంజయ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ పూనం మాల కొండయ్య , రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె. హేమచంద్ర రెడ్డి హామీ ఇచ్చారు. విశ్వవిద్యాలయ నూతన విసి ఆచార్య చింతా సుధాకర్ శుక్రవారం విజయవాడలో రాష్ట్ర ఉన్నతాధికారులను నలుగురిని విడివిడిగా కలిశారు. ఈ సందర్భంగా తనపై విశ్వాసం ఉంచి విసి గా నియమించినందుకు ఆచార్య చింతా సుధాకర్ పుష్పగుచ్చాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. విశ్వవిద్యాలయ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. వైవీయూకు రావాల్సిన నిధులు విడుదల చేయాలని, భవిష్యత్తు విశ్వవిద్యాలయ ప్రగతి కోసం నిధులు ఇచ్చి ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. సరికొత్త ప్రణాళికలతో విశ్వవిద్యాలయ ప్రగతి పరుగులెక్కించాలని, నిధులు సకాలంలో అందజేస్తామని వారు హామీ ఇచ్చారు. బోధన, పరిశోధన, పరిపాలనలో మీకున్న అనుభవాన్ని ఉపయోగించి విశ్వవిద్యాలయాన్ని అత్యున్నత స్థానంలో నిలబెట్టాలని సూచించారు. విసి వెంట కులసచివులు ఆచార్య వై .పి. వెంకటసుబ్బయ్య, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్ ఈశ్వర్ రెడ్డి ఉన్నారు.

పేద విద్యార్థులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి - కడప అర్బన్

మే 1 నుంచి 4 వ తేదీ వరకు నిర్వహించిన కేజిసెట్-2023 పరీక్షా ఫలితాలను శుక్రవారం కందుల గ్రూప్ విద్యాసంస్థలు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్‌లో ప్రతిభ ఉండి ఇంజినీరింగ్ చేయగల నిరు పేద విద్యార్థులకు ఈ సెట్ చక్కటి అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. ప్రతిభగల విద్యార్థులకు తమ వంతు ప్రోత్సాహం కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ఉచిత విద్య, ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. తాము నిర్వహించిన కజిసెట్ పరీక్షలకు రాయలసీమ నుంచి అపూర్వ స్పందన లభించిందని చెప్పారు. గత ఏడాది కంటే ఈ ఏడాది దాదాపు 3 వేల మంది విద్యార్థులు హాజరు కావడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. ఎస్. ఎస్. మూర్తి, కెఎల్ ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యం. వి. రత్నమ్మ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి. ప్రేమ్ కుమార్, వివిధ విభాగాల అధిపతులు, అడ్మిషన్స్ - డీన్ కె.రామమోహన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి

అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

అభివృద్ధికి ప్రజలు సహకరించాలని మేయర్ సురేష్ బాబు కోరారు. శుక్రవారం నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం మేయర్ అధ్యక్షతన నిర్వహించారు. తాగునీరు, డ్రెయినేజీ నిర్మాణం, సుందరీకరణ పనులు, హార్టికల్చర్ విభాగంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటడం వంటి పనులపై చర్చించి ఆమోదించారు. సమావేశంలో కమిటీ సభ్యులు శిరీష, మేసా ప్రమీలా రాణి, షఫీ,డిప్యూటీ కమిషనర్ రమణా రెడ్డి, ఎస్ఇ రతనాల రాజు, డిసిపి కుమార్, ఆర్ఒ భాస్కర్ గౌడ్, డిఇలు రాజేష్ ,కరీముల్లా,వేణు గోపాల్ , అబిద్ హుస్సేన్, ఎటిఒ అంజనీకుమార్, సీనియర్ అసిస్టెంట్లు విశ్వనాథ రెడ్డి ,శివ కుమార్, మేనేజర్ హిదాయతుల్లా, హార్టికల్చర్ ఏడీ అనిల్, శానిటరీ సూపర్‌వైజర్ భరత్, ఇన్‌స్పెక్టర్ రవీంద్రా పాల్గొన్నారు.



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న జిల్లా బిసిసంక్షేమ సంఘం ప్రతినిధులు

బిసి జనగణన చేయకపోతే పోరాటం

ప్రజాశక్తి - కడప

బిసి జనగణన చేపట్టకపోతే కేం ద్రంపై పోరా టం చేస్తామని బిసి సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిం దు నాగరాజు, జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బంగారు నాగయ్య యాదవ్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన వారు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిసి కులాల జనాభా గణన చేయకుంటే రాబోయే ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా పోరాడుతామని హెచ్చరించారు. ప్రధాని మోడీ బిసి అయినప్పటికీ చట్టసభలలో అవకాశం కల్పించడంలో ఘోరంగా విఫల మయ్యారన్నారు. ఉన్నత వర్గాల పేదలకు 10 శాతం రిజర్వేషన్లను ఆగమేఘాలపై పార్లమెంటులో బిల్లును ఆమోదింప చేశారని అన్నారు. దేశంలో పులులను సింహాలను లెక్కించినప్పుడు కేంద్రం బిసిల గణనపై చిన్న చూపు చూస్తుందన్నారు. క్రిమిలేయర్‌ను కేంద్ర ప్రభుత్వం వెం టనే రద్దు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీసీ జనగణన కమిటీ వెంటనే కార్యాచరణకు చర్యలు చేపట్టాల న్నారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారు సుంకేసుల ఖాదర్ బాషా, రాష్ట్ర కార్యదర్శి గువ్వల మధుసూదనరావు, జిల్లా ఉపాధ్యక్షులు కళ్యా సుధాకర్, సానే శ్రీనివాసులు, కృష్ణమూర్తి, మునిరత్నం, నరసింహ, జిల్లా కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.

5న మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళన

చెన్నూరు : మధ్యాహ్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 5న ఆం దోళన చేపట్టనున్నట్లు ఎపి మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా సహాయ కార్యదర్శి మేరి, జిల్లా సమితి సభ్యులు పి. సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. 20 ఏళ్ల నుంచి ప్రభుత్వ పాఠశాలలో వంట ఏజెన్సీలు నడుపుతున్న మధ్యాహ్న కార్మికులకు ప్రభుత్వం సరైన గుర్తింపు ఇవ్వలేదని వాపోయారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచలేదని వాపోయారు. కార్మికులకు కనీసం వేతనం రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



సిమ్మింగ్‌పూల్ ఏర్పాటుపై చర్చిస్తున్న రాష్ట్ర పరిపాలనా అధికారి శ్యామ్‌సుందర్

శిల్పారామాల్లో స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటు

ప్రజాశక్తి- కడప అర్బన్

కడప నగరం, పులివెందుల, అనంతపురం శిల్పారామాలలో స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు శిల్పారామం రాష్ట్ర పరిపాలన అధికారి శ్యామ్ సుందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కడప శిల్పారామంలో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం నుంచి కాంట్రాక్టర్ రమేష్ వచ్చి స్విమ్మింగ్ పూల్ ఏర్పాట్లను అంచనా వేశారని పేర్కొన్నారు. విశాఖపట్నంలో స్విమ్మింగ్ పూల్‌కు మంచి ఆదరణ లభిస్తుందని తెలిపారు. తక్కువ సమయంలో కడప ప్రజలకు ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తెస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఇ బలరామిరెడ్డి, కడప ఎఒ శివప్రసాద్ రెడ్డి, మునిరాజు, శిల్పారామం సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - కడప

కాలుష్య ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ పిలుపునిచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం కడప విద్యుత్ భవన్ ఆవరణలో పర్యావరణ రక్షించేందుకు, సంరక్షించేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకో రావడానికి మిషన్ లైఫ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యుత్ శాఖ అధికారి పర్యావరణ పరిరక్షణ కోసం సమిష్టి చర్యలు చేపట్టేందుకు విద్యుత్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్. నరసింహ ప్రసాద్, సోమశ్రీనివాసులు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ జి మధు కుమార్, అకౌంట్ ఆఫీసర్ మల్లికార్జున, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది

ఖాజీపేట తహశీల్దార్‌గా ఉదయభారతి

ప్రజాశక్తి - ఖాజీపేట


బాధ్యతలు స్వీకరిస్తున్న ఉదయభారతి

ఖాజీపేట తహశీల్దార్‌గా వై.ఉదయభారతి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె వీరపునాయునిపల్లె తహశీల్దార్‌ విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న రమణారెడ్డి బదిలీపై అమరావతిలోని సచివాలయ సెక్షన్‌ ఆఫీసర్‌గా వెళ్లారు. ఈ సందర్భంగా రమణారెడ్డిని కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. నూతనంగా విధుల్లో చేరిన తహశీల్దార్‌ ఉదయభారతిని సిబ్బంది ఘనంగా స్వాగతించారు. అనంతరం ఉదయభారతి మాట్లాడుతూ రైతు సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలు అందిస్తానని తెలిపారు.

5 నుంచి జీలుగలు పంపిణీ

ప్రజాశక్తి - దువ్వూరు

మండలంలోని వరి సాగు చేసే రైతులకు ఆ గ్రామ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో ఈనెల 5నుంచి పచ్చిరొట్ట తయారీకి జీలుగలు సబ్సిడీపై పంపిణీ చేస్తున్నట్లు ఎఒ అమరనాథ్‌రెడ్డి తెలిపారు. అవసరమైన రైతులు ఆయా గ్రామ పరిధిలోని ఆర్‌బికేల్లో తమ ఆధార్ కార్డు తీసుకెళ్లి జీలుగలు పొందాలని ఆయన సూచించారు. కిలో జీలుగల ధర రూ.79కాగా, సబ్సిడీపోను రూ.39.50 చెల్లించాలన్నారు.

వాలంటీర్లకు సేవామిత్ర అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల


వాలంటీర్లకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న కౌన్సిలర్లు అలీ, ప్రశాంత్

పట్టణ పరిధిలోని రాణివనం సచివాలయ పరిధిలోని వాలంటీర్లకు సచివాలయ కార్యాలయంలో వార్డు కౌన్సిలర్లు అలీ, ప్రశాంత్ శుక్రవారం సేవా మిత్ర అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాలంటీర్ వ్యవస్థతో ప్రభుత్వ పథకాలు ప్రజలకు మరింత చేరువయ్యాయని తెలిపారు. వాలంటీర్లు ప్రజలకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా అవార్డులతోపాటు నగదును అందించడం హర్షణీయమన్నారు. 16 మంది వాలంటీర్లకు సేవామిత్ర అవార్డుతోపాటు ప్రశంసాపత్రాలు, రూ.10వేలు అందించారు. సేవామిత్ర అవార్డు గ్రహీతలను సత్కరించారు. సచివాలయ అడ్మిన్ భవాని పాల్గొన్నారు.

ముద్దనూరు : ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయటంలో వాలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలు ఎనలేనివని సర్పంచ సరళ, ఎంపిడిఒ రమణారెడ్డి అన్నారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ అధ్యక్షతన ఎంపిడిఒ, కార్యదర్శి నరసింహులు ఆధ్వర్యంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముద్దనూరు సచివాలయం-2 పరిధిలోని వాలంటీర్ ఓబులేసును సర్పంచ సరళ, ఎంపిడిఒ రమణారెడ్డి సేవారత్న అవార్డు ప్రదానం చేసి సత్కరించారు. రూ.20వేలు నగదు అందజేశారు. ముద్దనూరు1-2 సచివాలయాల్లో పనిచేస్తున్న 42 మంది వాలంటీర్లకు సేవామిత్ర అవార్డు ప్రదానం చేసి ప్రశంసాపత్రం అందించి ఒక్కొక్కరికి రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు ఇంద్రాణి, రమేష్, వాలంటీర్లు పాల్గొన్నారు.


వాలంటీర్‌ను సన్మానిస్తున్న సర్పంచు, ఎంపిడిఒ

అభ్యంతరాలుంటే తెలియజేయండి

పులివెందుల టౌన్ : గత నెల 21న గాలివానకు పంటలు నష్టపోయిన రైతుల వివరాలను బీమా మంజూరు కోసం ఆర్‌బికె కేంద్రాలలో ప్రదర్శించామని, ఇందులో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఉద్యాన అధికారి రాఘవేంద్రారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించిన రైతు వివరాలను పరిశీలించాలన్నారు. జాబితాలో అర్హులు లేకపోయినా, అనర్హులున్నా ఉద్యానశాఖాధికారులకుగానీ, వ్యవసాయాధికారులకుగానీ తెలియజేయాలన్నారు. అనంతరం ఆ జాబితాను సవరిస్తామన్నారు


మానవాళి మనుగడకు చెట్లే ఆధారం

ముద్దనూరు : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అటవీశాఖ డిప్యూటీ ఎఫ్‌ఆర్‌ఒ చంద్రశేఖర్ కోరారు. స్థానిక మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం అటవీశాఖ ఆధ్వర్యంలో సర్పంచ సరళ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి మనుగడకు చెట్లు ఎంతో ఆధారమన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి నరసింహులు, సిబ్బంది రత్నరాజు, ఎంపిటిసి ఇంద్రాణి పాల్గొన్నారు.

బిసిలకు రక్షణ చట్టం హర్షణీయం

ప్రజాశక్తి - వేంపల్లె

ఆంధ్రుల భవిష్యత్తుకు గ్యారంటీ ఇస్తూ.. బిసిలకు రక్షణ చట్టాన్ని టిడిపి నేత చంద్రబాబు తన మేనిఫెస్టోలో పెట్టడం హర్షణీయమని టిడిపి బిసి సెల్ అధ్యక్షుడు గోగుల మల్లికార్జున తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి హయాంలో మహాశక్తి పథకం కింద 18 ఏళ్లు నిండిన మహిళకు నెలకు రూ.1500, తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే వారందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15వేలు, దీపం పథకం కింద ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారన్నారు. మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. చంద్రబాబు మేనిఫెస్టో పట్ల మల్లికార్జున హర్షం వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో తెలుగు యువత అధ్యక్షుడు తెల్లగొర్ల మల్లికార్జున, గొర్ల వెంకటేశు, రామాంజనేయులు, దస్తగిరి, రమేష్, తాలూకా కార్యదర్శి శ్రీను, విజయ్, దస్తు రాజా, హరి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బిసి సెల్ అధ్యక్షుడు గోగుల మల్లికార్జున

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల



స్థానిక రైల్వేస్టేషన్‌లో శుక్రవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో చెన్నై నుంచి వస్తున్న రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ వర్మ తెలిపారు. మృతునికి సుమారు 45 ఏళ్లు ఉంటాయని, ఎలాంటి ఆధారాల్లేవన్నారు. అతని ఒంటిపై పింక్ కలర్ షర్టు, నశం కలర్ లుంగీ, ఎమ్మవగా మీసాలు గడ్డం ఉన్నాయని తెలిపారు. గుర్తు పట్టినవారు ఎర్రగుంట్ల రైల్వే పోలీస్‌స్టేషన్‌లో కానీ, 94406 27658 నంబర్‌కు సమాచారమివ్వాలని ఎస్ఐ

పెట్రోల్ పోసి మరో గుర్తు తెలియని వ్యక్తి కాల్చివేత

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని స్థానిక బుగ్గలేటిపల్లె వంక సమీపంలో తుమ్మచెట్ల పొదల్లో సగం కాలిన మృతదేహం కలకలం రేపుతోంది. శుక్రవారం స్థానికులు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందజేశారు. స్పందించిన రూరల్ సిఐ అశోక్‌రెడ్డి, ఎస్ఐ అరుణ్‌రెడ్డి తమ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసుల ప్రాథమిక సమాచారం మేరకు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగి ఉండొచ్చునని, అతని కుడి చేతిపై కె.సుభాషిని అని పచ్చబొట్టు ఉన్నట్లున్నారు. మృతుడి సమాచారం తెలిసినవారు కడప రూరల్ సిఐ అశోక్‌రెడ్డి 91211 00525, ఎస్ఐ అరుణ్‌రెడ్డి 91211 00526 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

అరటి మొక్కల రక్షణకు కొత్త పద్ధతులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

అరటి పంట సంరక్షణ కోసం రైతులు థర్మాకోల్, ఈతాకులు ఉపయోగిస్తున్నారు. మొక్క నాటిన దశలో పంటను రక్షించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో రైతులు అరటి పంట రక్షణకు ప్రయత్నిస్తున్నారు. విపరీతమైన ఎండలకు అరటి పిలక ఎదగాలంటే చాలా కష్టం. అవి ఆదిలోనే చనిపోయే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఈ స్థితిలో పిలక కొంత ఎదుగుదల వచ్చేవరకు థర్మాకోల్, ఈతాకులను వినియోగిస్తున్నారు. ఈ పద్ధతులకు సుమారు ఎకరాకు రూ.5నుంచి రూ.8వేలు వరకు ఖర్చు వస్తుందని రైతులు అంటున్నారు. అలాగే వేరుశనగ పంటకు కూడా రైతులు సరికొత్త పద్ధతులను అనుసరిస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో పంట పొలాలకు అడవి జంతువుల బెడద ఎక్కువైంది. ఈ స్థితిలో పంట చుట్టూ గతంలో విద్యుత్ తీగలు వేసేవారు. అయితే అది ప్రాణాపాయం అని భావించిన రైతులు కొత్త పద్ధతులు ఎంచుకున్నారు. పొలం చుట్టూ చీరలు అమర్చుతున్నారు. దీనివల్ల అడవి జంతువులు పంట పొలాల్లోకి రావని రైతులు అంటున్నారు.


అరటి మొక్కపై రక్షణగా ఉంచిన థర్మాకోల్

ఆమోదం పొందిన పనులే చేపట్టాలి


మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి సుధాకర్

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలో శుక్రవారం సర్పంచు శివప్రసాద్ అధ్యక్షతన గ్రామ పంచాయతీ సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశానికి నలుగురు వార్డు మెంబర్లు హాజరయ్యారు. సమావేశాన్ని మొదట రద్దు చేయాలని భావించినప్పటికీ హాజరైన సభ్యులు సమావేశాన్ని నిర్వహించాలని కోరారు. వార్డుసభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు ఎంపిటిసి ఎస్ఆర్ బాలనరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే గ్రామసభ నిర్వహణ సరిగా లేదన్నారు. గ్రామపంచాయతీ నిధులు ఇష్టానుసారంగా ఖర్చు చేస్తున్నారని, ఇకమీదట గ్రామ సభలో ఆమోదం పొందిన పనులు మాత్రమే చేపట్టాలని తీర్మానించారు. గ్రామంలో డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందని, ప్రాధాన్యత ఇచ్చి ఆ సమస్యను పరిష్కరించాలన్నారు. గ్రామంలో పశువైద్య సిబ్బందిని తక్షణమే ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో, పంట పొలాల్లో విద్యుత్ వైర్లు తక్కువ ఎత్తులో ఉన్నాయని వాటిని సరిచేయాలన్నారు. ఉప సర్పంచు ఓబులేసు పంచాయతీ కార్యదర్శికి హాజరైన సభ్యులతో కలిసి సర్పంచు ఎన్నికలో ఏర్పరచుకున్న ఒప్పందం అమలు కాలేదని వినతి పత్రాన్ని అందజేశారు. ఎన్నికలకు ముందు చేసుకున్న ఒప్పందం ప్రకారం ప్రస్తుతం ఉపసర్పంచుగా ఉన్న ఓబులేసుకు సర్పంచు పదవి ఇవ్వాలని సభ్యులు తీర్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్, సచివాలయ సిబ్బంది, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

బిజెపి పాలనలో రాష్ట్రానికి తీరని అన్యాయం

ప్రజాశక్తి - వేంపల్లె


మాట్లాడుతున్న తులసిరెడ్డి

రాష్ట్ర విభజన జరిగి నేటికి తొమ్మిదేళ్లయినా కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి విమర్శించారు. స్థానికంగా శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిజెపి మోసగారితనం, వైసిపి, టిడిపిల చేతగానితనం వల్ల కేంద్రం రాష్ట్రానికి ఇవ్వాల్సింది కొండంత, ఇచ్చింది గోరంత అన్నారు. విభజన సందర్భంగా నాటి కాంగ్రెస్ ప్రభుత్వం సీమాంధ్రకు మూడు వరాలు ఇచ్చిందన్నారు. ప్రత్యేకహోదా, ప్రత్యేకప్యాకేజీ, ప్రత్యేక ఆర్థికసాయం చేసి ఉంటే స్వర్ణాంధ్ర అయి ఉండేదని తెలిపారు. మోడీ ప్రభుత్వం ప్రత్యేకహోదాకు పంగనామాలు పెట్టిందన్నారు. బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ కింద రూ.24,350 కోట్లకుగానూ కేవలం రూ.1,050 కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు. మూడో వరం రూ.5 లక్షల కోట్లకుగానూ కేవలం రూ.40 వేల కోట్లు మాత్రమే ఇచ్చిందని తెలిపారు. దుగ్గరాజపట్నం ఓడరేవు ప్రస్తావనే లేదన్నారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమకు స్వస్తి పలికినట్లు చెప్పారు. విశాఖ, విజయవాడ మెట్రో రైలు, విశాఖ రైల్వే జోన్ లేదన్నారు. బిజెపి చేతిలో వైసిపి, టిడిపి కీలు బొమ్మలుగా మారాయని విమర్శించారు. జగన్ రెడ్డి భజన రెడ్డిగా, చంద్రబాబు చెక్క భజన బాబుగా మారిపోయారని ఎద్దేవా చేశారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి, వైసిపి, టిడిపిని ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించాల్సిన చారిత్రక ఆవశ్యకత ఎంతైనా ఉందని తులసిరెడ్డి అన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - చాపాడు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి మణికంఠ పిలుపునిచ్చారు. ఎస్‌వి స్టడీ సర్కిల్‌లో శుక్రవారం భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్రం, అమ్మ సేవాసమితి ఆధ్వర్యంలో మిషన్ లైఫ్ మేరీ లైఫ్‌లో భాగమైన లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వనిపెంట డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పిఎ శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ బాగ్స్ వాడకం తగ్గించి, జ్యూట్ బాగ్స్ వంటివి వాడాలన్నారు. అలాగే యువత కలసి కట్టుగా పర్యావరణాన్ని కాపాడు కోవడానికి తగిన జాగ్రత్తలను తెలుసుకొని గ్రామాల్లోని ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమ అనంతరం విద్యార్థులచే పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞను చేయించారు. కార్యక్రమంలో గంజికుంట ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సుబ్బారాయుడు, విశ్రాంత ఉపాధ్యాయులు చలమయ్య, వనిపెంట అటవీశాఖ సిబ్బంది, ఎస్‌వి స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రజాపతి, చేయూత చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు మోత ఉపేంద్ర, వాగ్దాడం శివశంకర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్యామ్‌సుందర్

పేదల వైద్యానికి సిఎం జగన్ పెద్దపీట


వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

గ్రామాల్లో ఉన్న పేదల ఆరోగ్యం, వైద్య సేవలకు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గొరిగినూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన వైయస్సార్ విలేజ్ క్లినిక్‌ను శుక్రవారం సుధీర్‌రెడ్డి, సర్పంచు పందింటి మత్తయ్య, ఎంపిటిసి భాస్కర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లను సిఎం ఏర్పాటు చేశారన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లనవసరం లేదన్నారు. ఈ ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు, బిపి, షుగర్, మలేరియా మొదలగు జబ్బులకు ఉచితంగా పరీక్షలు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచు పందింటి మత్తయ్య మాట్లాడుతూ గ్రామాల్లో అవ్వ తాతలకు, మహిళలకు, చిన్నపిల్లలకు ఆరోగ్య సేవలను అందించేందుకు వైఎస్ఆర్ విల్లేజ్ క్లినిక్ ఎంతో దోహదపడుతుందన్నారు. గొరిగనూరులో వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేసినందుకు సిఎం జగన్, ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి డాక్టర్ ఖాదర్‌వలి జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ పి.శాంతికళ, ఆర్.బి.ఎస్.కె.డాక్టర్ లక్ష్మీకర్, మోరగుడి వైద్యాధికారి డాక్టర్ దీపిక, సిబ్బంది రాజేశ్వరి, ఓబులేసు, శ్రీరాములు, గంగాదేవి, ఎలిజిబెత్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


ప్రతిభా అవార్డులతో విద్యార్థులు, ఎస్‌టియు నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఉపాధ్యాయ సంఘం అంటే కేవలం పోరాటాలు ఉద్యమాలే కాదు, ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించడం, చేయూతనివ్వడం కూడా సంఘం బాధ్యతని కర్నూలు జిల్లా డోన్ ఉప విద్యాశాఖ అధికారి, జమ్మలమడుగు ఎంఇఒ క్రిస్టఫర్ పేర్కొన్నారు. ఎస్‌టియు జమ్మలమడుగు రీజియన్ పరిధిలో జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాల పదవ తరగతి ప్రభుత్వ పాఠశాలల ప్రతిభావంతమైన విద్యార్థులకు శుక్రవారం పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా క్రిస్టఫర్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించి వారికి బహుమతులు అందజేయడం శుభ పరిణామమన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. ఎస్‌టియు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ యూనియన్ జమ్మలమడుగు రీజియన్ మంచి కార్యక్రమం నిర్వహించిందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుకుమార్ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ప్రభుత్వ పాఠశాలలో అత్యుత్తమ ఫలితాలు రావడం సంతోషదాయకమన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఎస్‌టియు రీజనల్ కన్వీనర్ ప్రతాపరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, గురుకుల పాఠశాలల ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి, ప్రభావతి దేవి, ప్రభావతి, మైలవరం ప్రధానోపాధ్యాయులు పరమేశ్వరయ్య, డిసిఇబి సెక్రెటరీ శోభారాణి, మాట్లాడారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు కుండా భాస్కర్ ప్రతిభ కనబరిచిన వారికి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు ఎలా చదివారో, వారి తల్లిదండ్రులు ఎలా చదివించారో తెలియజేశారు. యూనియన్ నాయకులు ప్రసాద్‌బాబు, ఆంజనేయరెడ్డి, శివరాం, వెంకటేశ్వర్లు, పార్థసారథి, కృష్ణారెడ్డి, సంజీవ రాయుడు, మహేశ్వర్‌రెడ్డి, గురుప్రసాద్, తిరుమల కొండయ్య, మల్లికార్జున, రంగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలం చెల్లిన మందులతో చెలగాటం తగదు : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కాలం చెల్లిన మందులతో రోగుల ఆరోగ్యంతో చెలగాటం తగదని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిలో కాలం చెల్లిన (ఎక్స్‌పైర్) మాత్రలు రోగులకు ఇస్తున్నారని ప్రజలు వాపోతున్నారన్నారు ప్రజల ప్రాణాలతో వైద్య సిబ్బంది చెలగాటమా లేక నిర్లక్ష్యమా అని ప్రశ్నించారు. దీనిపై అధికారులు దృష్టి సారించి, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన కోరారు. ఆస్పత్రికి పేదలు వస్తుంటారని, సంబంధిత అధికారులు స్పందించాలన్నారు.

త్వరగా ఇళ్లను నిర్మించుకోండి

- మండల ప్రత్యేకాధికారి మల్లికార్జున

ప్రజాశక్తి - లింగాల

మండల పరిధిలో లింగాల, బోనాల గ్రామాల్లో లబ్ధిదారులు త్వరగా ఇళ్లను పూర్తి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జున కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద శుక్రవారం ఇళ్ల మంజూరైన లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగాలలో 23, బోనాలలో 27 ఇంటి నిర్మాణాలు పెండింగులో ఉన్నాయన్నారు. వీరికి మొదటి దశలో రూ.70 ఖాతాలో జమ చేశామన్నారు. అనంతరం లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు ఇటుకలు, ఇసుక లభించడం లేదని అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ కారణంగా ఇళ్ల నిర్మాణాలు ఆలస్యమవుతున్నాయని లబ్ధిదారులు వివరించారు. ఇందుకు ఎంపిడిఒ సురేంద్రనాథ్ స్పందిస్తూ.. మీకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. త్వరగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.


లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

'అన్నదానం సంతోషాన్నిస్తుంది'

ప్రజాశక్తి - వేంపల్లె


అన్నదానం చేస్తున్న ఇబ్రహీం

అనాథ వృద్ధా శ్రమంలో అన్నదానం చేయ డం సంతోషంగా ఉందని ఆయాన్ బజాజ్ షోరూం ఎండి ఇబ్రహీం తెలిపారు. ఇబ్రహీం తనయుడు మహ మ్మద్ అయాన్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం స్థానిక పాత గండి రోడ్డులో ఉన్న మదర్‌థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. స్వీట్స్, అరటి పండ్లు, మామిడి పండ్లు వృద్ధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఇబ్రహీం మాట్లాడుతూ ప్రతి ఏడాది తన కుమారుని పుట్టినరోజు వేడుకలను అనాథ వృద్ధుల మధ్య జరుపుకుంటున్నట్లు తెలిపారు. అనాథలను ఆదుకోవడం అనేది ప్రతి ఒక్కరు కర్తవ్యంగా భావించాలని కోరారు. కార్యక్రమంలో ఇబ్రహీం కుటుంబ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

14 గ్రామాల ప్రజల వివరాలు ఇవ్వండి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కొండాపురం మండలం గండికోట ప్రాజెక్టు కింద మునకకు గురైన మొదటి విడత పాత 14 గ్రామాల ప్రజలుతమ పూర్తి వివరాలను ఆ మండల తహశీల్దార్‌కు సమర్పించాలని ఆర్‌డిఒ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గండికోట ప్రాజెక్టు నిర్వాసితులకు (పాత 14 గ్రామాల) ముఖ్యమంత్రి ప్రకటించిన అదనపు ప్యాకేజీ పరిహారం రూ.3,25,000 విషయమై ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ పాసు బుక్ జిరాక్స్ కాపీలు ఇవ్వాల్సి ఉందన్నారు. వివరాలను ఏడు రోజుల్లో అందజేయాలని ఆర్‌డిఒ సూచించారు.

కొండాపురం : గండికోట ప్రాజెక్టు క్రింద మొదటి విడతగా ముంపునకు గురైన 14 గ్రామాలకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేరకు పరిహారం పొందేందుకు ఆయా గ్రామాల ప్రజలు రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ శోభన్‌బాబు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ముంపువాసులు తమ వివరాలను కొండాపురం కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఈ ఏడాది చివరలో పదివేల గృహప్రవేశాలు

- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జగనన్న గృహపథకం కింద నియోజకవర్గంలో 24వేల మందికి ఇళ్లు మంజూరయ్యాయని, నిర్మాణాలు పలు దశల్లో ఉన్నాయని, డిశంబర్ నెలాఖరుకు పదివేల గృహప్రవేశాలు చేయిస్తామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్ల కాలంలో రూ.520కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పలుసార్లు చెప్పామన్నారు. అయినా టిడిపి నాయకులకు చెవికెక్కకపోవడం దురదృష్టకరమన్నారు. ఎలాంటి అభివృద్ధి జరుగలేదని పాదయాత్ర సందర్భంగా లోకేష్‌తోపాటు స్థానిక టిడిపి నాయకులు చెప్పడం సరికాదన్నారు. తనపై వ్యక్తిగత ఆరోపణలు చేశారని, వీటిపై గతంలో తాను విశాఖ సిబిఐ కార్యాలయంలో విచారణ కోరిన విషయం కూడా పత్రికల ద్వారా టిడిపి నాయకులకు తెలపామన్నారు. నందం సుబ్బయ్య హత్య విషయంలో తనకుకానీ, తన కుటుంబానికిగానీ ఎలాంటి సంబంధంలేదని గతంలో ప్రమాణం చేసిన విషయం ఎమ్మెల్యే గుర్తు చేశారు. తన వ్యక్తిత్వం ప్రజలకు తెలుసని, 2024 ఎన్నికల్లో తీర్పుతో సమాధానం చెప్తారన్నారు. లోకేష్ పాదయాత్రకు తమ అనుచరులు ఎలాంటి అడ్డంకులు సృష్టించలేదన్నారు. అతిథిగా భావించి స్వాగతం పలికామన్నారు. వైసిపి సంక్షేమ పథకాలను, కర్నాటక ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్, బిజెపి సంక్షేమ పథకాలను టిడిపి హైజాక్ చేసిందని రాచమల్లు విమర్శించారు.


బీమా గురించి రైతులకు వివరిస్తున్న పశు వైద్యాధికారి శ్రీహరి

పాడి రైతులకు ధీమా.. పశువుల బీమా

ప్రజాశక్తి - దువ్వూరు

పశు బీమా పాడి రైతులకు ధీమా అని మండల పశు వైద్యాధికారులు ఫణీంద్రారెడ్డి, శ్రీహరి సూచించారు. మండలంలోని పాడి రైతులకు అలాగే గొర్రె మేకలకు పశు బీమా పథకం ప్రభుత్వం ప్రవేశపెట్టిందని పాడి రైతులకు ధీమా పశువుల బీమా అని మండల పశువైద్యాధికారులు ఫణింద్రారెడ్డి, శ్రీహరిలు, తెలిపారు. మండలంలోని పెద్దజొన్నవరంలో శుక్రవారం వారు పాడిరైతులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పశు బీమా పథకం ప్రవేశపెట్టిందని తెలిపారు. వివిధ రకాల వ్యాధులు, ప్రమాదాలతో ప్రతి ఏడాది ఎన్నో జీవాలు చని పోతున్నాయన్నారు. దీని వల్ల వాటిమీద ఆధార పడి జీవించేవారు నష్ట పోతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో పశువులకు బీమా చేయిస్తే నష్టం నుంచి బయటపడవచ్చని వివరించారు. బీమా వివరాలకు రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో వైద్యాధికారిని సంప్రదించాలని వారు సూచించారు.

IN THE COURT OF THE HON'BLE Ist ADDITIONAL DISTRICT JUDGE, KADAPA

G.O.P.No. 11/2023

(In the matter of application Uls.7 and 10 r/w 29 of Guardian and Wards Act, 1890 for appointment of the petitioner as Guardian with respect of the person and property of the minor namely Kurava Sree Vidya for permission of sale of property)

Kurava Sree Vidya rep. by her natural guardian namely Kurava Saraswathi.

...Petitioner

Vs.

NIL. **...Respondents**

NOTICE

The above petitioner is filed the above petition to declare as guardian to the person and property of the share of said her minor daughter. If any body has objection they may appear on 19.06.2023 by 10.-30 A.M. before the above Court and raise objections, otherwise orders will be passed according to law.

SCHEDULE

Item No.1 (Property under Regd. Sale Deed dated 05.12.1995 Doc.No.5227 / 1 995):-

Kadapa District, Kadapa Sub-District, in the village fields of Chemmumiahpeta, Chemmumiah peta Grama Panchayath, Ward No.8, besides H.No.8/153 in Circar Punji D.No.528 an extent of Ac.0.02 cents out of Ac.0.06 cents out of Ac.0.08 1/2 cents out of Ac.4.76 cents, bounded by: East: Site sold to others by Mitta Malla Reddy in same Sy. No., West: Site left for rastha in same Sy. No., North: Remaining site, South: Site sold to Hanumatha Reddy, Measuring: East-West: on Northern side: 66 ft., East-West: · on Southern side: 66 ft., North-South: on Eastern side: 13.3 ft., North-South: on Western side: 13.3 ft., along with all other easementary rights for ingress and egress.

Item No.2 (Property under Regd. Sale Deed dated 12.08.2009 Doc.No.3071/ 2009):-

Kadapa District, Kadapa Sub-District, in the village fields of Chemmumiahpeta, Nabikota (Ravindra Nagar) in Circar Punji D.No.528 in an extent of 68.88 Sq. yards, out of Ac.0.04 cents out of Ac.4.76 cents, and site left for pubfic rastha on the Southern side to an extent of 5 1/4 ft., within the limits of Municipal Corporation, Kadapa, bounded by: East: Drainage Canal, West: Site of A.Vijayamma, North: Drainage Canal, South: Site of Kanakam Eswaraiah, Measuring: East-West: on Northern side: 31 ft., East-West: on Southern side: 31 ft., North-South: on Eastern side: 20 ft., North-South: on Western side: 20 ft.,along with all other easementary rights for ingress and egress.

//By Order of the Court//

M. SAI NIRANJAN BABU,
B.A.,B.L.,

M. SAI VAMSI KRISHNA,
B.Com., LLB.,

Advocates, Kadapa.